క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో ప్రదోష పూజలు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎస్కం డ్రిగ సమీపంలోని అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం ప్రదోష కాల పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శివునికి, నందీశ్వరునికి ఏకకాలంలో అభిషేకాలు, విశేష పూజలు చేశారు. వేకువజామునే కొండమల్లీశునికి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. సాయంత్రం నందీశ్వరుడికి పసుపు, కుంకుమ, పాలతో అభిషేకం చేశారు. సుగంధ భరిత పుష్పాలతో విశేషంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులకు దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. ఇందులో భాగంగా ఆలయం ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి పూజలు చేశారు.

ద్రౌపదీదేవికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంటలో ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువ జామునే అమ్మవారికి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి పాలాభిషేకం చేశారు. వెండి తొడుగులతో కూడిన ఆభరణాలు, పట్టు పీతాంబరాలతో అమ్మవారిని అలంకరించారు. విశేష పూజల అనంతరం భక్తులకు దర్శనం కల్పించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

వైభవంగా ఆరాధన ఉత్సవాలు



ప్రత్యేక అలంకరణలో పీఠాధిపతుల విగ్రహాలు

నగరి : మున్సిపల్ పరిధిలోని కీళపట్టు చంద్ర మౌళీశ్వర ఆలయంలోని కంచికామకోటి పీఠాధిపతుల సన్నిధిలో ఆరాధన ఉత్సవాలు శుక్రవారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా కంచికామకోటి పీఠాధిపతుల విగ్రహాలకు ప్రత్యేక అభిషేకాలు చేసి పుష్పాలతో అలంకరించి అర్చనలు చేశారు. పలువురికి అన్నదానం చేశారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

పుత్తూరు: భారత రాజ్యాంగా నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ 134వ జయంతిని ఏప్రిల్ 14న విజయవంతం చేయడానికి అన్ని సంఘాల వారు కలసి రావాలని వడమాలపేట ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు జయంత్‌బాబు కోరారు. ఈ మేరకు శుక్రవారం వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. స్థానిక ఎస్ఐ ధర్మారెడ్డికి కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు గురవయ్య, ప్రభాకర్, గణేష్‌కుమార్, వెంకటేష్, మస్తాన్, వెంకటస్వామి, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

భక్తిప్రపత్తులతో ప్రదోష పూజలు

నాగలాపురం: మండలంలో సురుటుపల్లెలోని శ్రీ సర్వ మంగళా సమేత శ్రీ పళ్లికొండేశ్వర స్వామి దేవస్థానంలో శుక్రవారం భక్తి ప్రపత్తులతో ప్రదోష పూజలు నిర్వహించారు. నందీశ్వరుడు, వాల్మీకేశ్వరస్వామికి ఏక కాలంలో పూజలు చేశారు. ఈ పూజలకు ఆంధ్ర, తమిళనాడు రాష్ట్రాల భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. భక్తులకు ఆలయ చైర్మన్ ఏపీఎం మునిచంద్రశేఖర్ రెడ్డి, కార్య నిర్వహణాధికారి రామచంద్రారెడ్డి దర్శన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు కవిత, మంజుల, ఉమాపతి, మునివేలు, ఆనంద్ ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం తరలిస్తున్న నలుగురి అరెస్ట్

తిరుపతి క్రైమ్: అక్రమంగా మద్యం తరలిస్తున్న నలుగురిని తిరుపతి రూరల్ సెబ్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. తిరుపతి రూరల్ సెబ్ సీఐ భీమలింగ తెలిపిన వివరాల మేరకు.. జిల్లా సెబ్ అదనపు ఎస్పీ రాజేంద్రకు ముందస్తుగా అందిన సమాచారం మేరకు సెబ్ అధికారులు తనిఖీలు చేస్తుండగా తిరుచానూరు–తనపల్లి రోడ్డు ఐస్ ఫ్యాక్టరీ దగ్గర అనుమానాస్పదంగా ఉన్న నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్దనున్న స్కూటీని తనిఖీ చేశారు. వారి వాహనంలో 40 వేల 300 రూపాయల విలువ చేసే 102 క్వాటర్ బాటిళ్లు ఉన్నాయి. ద్విచక్ర వాహనాన్ని, మద్యంను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో తిరుచానూరు చెందిన నెల్లూరు యుగంధర్, చంజీ సుబ్రమణ్యం, ప్రభుత్వ మద్యం దుకాణంలో పనిచేస్తున్న సేల్స్‌మెన్ అబ్దుల్ రెహమాన్, ఎస్.రాజాను అరెస్ట్ చేశారు. మరో వ్యక్తి పరారయ్యాడు. అతని కోసం గాలిస్తున్నారు.

సంక్షేమ పాలనకే జైకొడదాం

- మంత్రి ఆర్‌కే రోజా సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డి
- ఇంటింటికీ వెళ్లి పథకాల లబ్ధిపై అవగాహన



ప్రచారం చేస్తున్న మంత్రి సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి

నగరి: గత ప్రభుత్వం మాదిరిగా అబద్ధపు హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేయకుండా, ఈ 58 నెలల వైఎస్సార్‌సీపీ పాలనలో దాదాపు అన్ని హామీలు నెరవేర్చి అభివృద్ధి చేశామని, వచ్చే ఎన్నికల్లో తమను గెలిపించాలని మంత్రి ఆర్‌కే రోజా సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డి కోరారు. శుక్రవారం మండలంలోని మాంగాడు గ్రామంలో పార్టీ నాయకులతో కలిసి మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ పర్యటించి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అమలు చేసిన పథకాలపై అవగాహన కల్పించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్‌కే రోజాను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ప్రలోభపెట్టే ప్రతిపక్ష పార్టీల నేతలు గాజు ముక్కల్లా మెరుస్తూ అడుగడుగునా ఉంటారని వ్యాఖ్యానించారు. అభివృద్ధిని, సంక్షేమాన్ని ప్రత్యక్షంగా చేసి చూపిన ప్రభుత్వం తమదే అన్నారు. అందులో భాగంగా ఆయన గ్రామంలో జరిగిన అభివృద్ధిని కళ్లకు కట్టినట్లు చూపే కరపత్రాలను ప్రతి ఇంటికీ అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీ డిల్లీ, పార్టీ అధ్యక్షుడు సుదర్శనం నాయుడు, పీఏసీఎస్ చైర్మన్ తిరుమలరెడ్డి, ఆర్బీకే చైర్మన్ బుజ్జిరెడ్డి, సచివాలయ కన్వీనర్ హరి, నాయకులు భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీలు చంద్రారెడ్డి, ఏసు, శ్రీనివాసులు రెడ్డి, జగదీష్ రెడ్డి, నాగయ్యనాయుడు, గోవిందరెడ్డి, సురేష్, ప్రకాష్, రవికుమార్, చిన్నా, తంగరాజ్ తదితరులు పాల్గొన్నారు.



వృద్ధురాలికి సంక్షేమ పథకాల బావుటా అందజేస్తున్న రామ్‌ప్రసాద్ రెడ్డి

గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం



మాట్లాడుతున్న పూర్ణ చంద్రా రెడ్డి

గంగాధర నెల్లూరు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో గతంలో కంటే రెట్టింపు ఉత్సాహంతో గెలుపే లక్ష్యంగా కలిసికట్టుగా పనిచేద్దామని, మరోసారి సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించుకుందామని మండల కన్వీనర్ పూర్ణచంద్రా రెడ్డి అన్నారు. మండలంలోని ఎట్టేరి గ్రామంలో ఆయన ఆధ్వర్యంలో మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా పేద ప్రజలకు అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు వారి ముంగిటకే అందాయని, ఏ ప్రభుత్వం కూడా పేదలను పట్టించుకోలేదన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షాన నిలబడి అన్ని విధాల బడుగు బలహీన సామాజిక వర్గాలను అభ్యున్నతికి కృషి చేశారన్నారు. గంగాధర నెల్లూరు నియోజకవర్గ అభ్యర్థి కృపాలక్ష్మిని అత్యధిక మెజారిటీతో గెలిపించి, సీఎంకు బహుమతిగా ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ గుణశేఖర్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు వేల్కూరు బాబు రెడ్డి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు ముని రాజారెడ్డి, వైస్ ఎంపీపీ హరిబాబు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటరెడ్డి, రైతు భరోసా కేంద్రం మండల అధ్యక్షుడు బలరామరెడ్డి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు ఏకాంబరం, మండల ఉపాధ్యక్షుడు పుష్పరాజ్, ఎంపీటీసీ సభ్యుడు గోవింద్ రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ వేలు మొదలియార్, నాయకులు నాయనిరెడ్డి , రామచంద్రారెడ్డి , పుట్ట, రాజేందర్ రెడ్డి, సర్పంచులు ఆబు, కృష్ణారెడ్డి, జనార్దన్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి , కుట్టి, వెంకటేష్ రెడ్డి, చంద్ర దేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

మరోమారు జగనన్నకు పట్టం కడదాం



ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

పుత్తూరు: ప్రజారంజక పాలన అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రెండవసారి ముఖ్యమంత్రిని చేసుకుందామని మున్సిపల్ చైర్మన్ ఏ.హరి పిలుపునిచ్చారు. శుక్రవారం పుత్తూరు మున్సిపాలిటీ 3వ వార్డు కౌన్సిలర్ ఓ.రాజేశ్వరి ఆధ్వర్యంలో సత్యనారాయణ కాలనీ సచివాలయ పరిధిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత చంద్రబాబు పాలనలో సంక్షేమం ఊసే లేదని, అభివృద్ధి అటకెక్కిందని చెప్పారు. నేడు జగనన్న ఐదేళ్ల పాలనలో అద్భుతాలు చేశారని, ఇందుకు దేశ ప్రధాని ప్రశంసలే నిదర్శనమన్నారు. ఎన్నికల సందర్భంగా ప్రతి రాజకీయ పార్టీ విడుదల చేసే మేనిఫెస్టోలోని హామీలను నెరవేర్చిన దాఖలాలు లేవని, అయితే జగనన్న 99 శాతం హామీలను నెరవేర్చి సరికొత్త చరిత్ర సృష్టించారని వివరించారు. ఇలాంటి సీఎం మనకు ఉండడం రాష్ట్ర ప్రజలు చేసుకున్న అదృష్టమని అభివర్ణించారు. ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా, మరింత అభివృద్ధి జరగాలన్నా మరోసారి జగనన్నను సీఎం చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నా రు. నగరి ఎమ్మెల్యేగా మంత్రి రోజాకు మరో అవ కాశం ఇవ్వాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు డి.శంకర్, డి.జయప్రకాష్, సచివాలయ కన్వీనర్ ఏకాంబరం, వైఎస్సార్‌సీపీ నాయకులు మునిరత్నం, షకీలా, జయచంద్రన్, మనోహర్‌రెడ్డి, లారీ మోహన్, జయబాబు, కైలాసం, గోపి, సుదర్శనం, మురళీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యానికి మేలు



కావునూరు: అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమంలో ఎంపీడీఓ

నింద్ర: బాలింతలు, గర్భిణులు, కిశోర బాలికలు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని ఎంపీడీఓ భవానీ అన్నారు. శుక్రవారం మండలంలోని కావునూరు, కొప్పేడు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో జరిగిన పౌష్టికాహార పక్షోత్సవాల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలింతలు, కిశోర బాలికలు తీసుకునే ఆహార విధి విధానాలు, పరిసరాల పరిశుభ్రత, ఆహార శుభ్రత, చిరుధాన్యాలు తీసుకుంటే కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్యామల, అంగన్‌వాడీ కార్యకర్తలు కాంచన, రాధిక, కన్నెమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఫ్లాగ్‌మార్చ్



ఎస్ఎస్‌బీ ఫోర్స్‌తో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న సీఐ, ఎస్ఐ

నగరి : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బందోబస్తుకు విచ్చేసిన పోలీసు బలగాలను ప్రజలకు చూపుతూ భద్రతపై చేపట్టిన గట్టి నిఘాను వివరించే ప్రయత్నంలో భాగంగా సీఐ సురేష్ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. శుక్రవారం మండలంలోని గుండ్రాజకుప్పం, గుండ్రాజుకుప్పం దళితవాడ, కేవీపీఆర్ పేట, ఏకాంబరకుప్పం, తెరణి గ్రామాల్లో ఎన్నికల విధులకు విచ్చేసిన సహస్త సీమా బల్ (ఎస్ఎస్‌బీ) ఫోర్స్‌తో ఫ్లాగ్ మార్చ్ చేపట్టారు. ఎన్నికల్లో ఎలాంటి అవకతవకలకు పాల్పడకూడదని ప్రశాంత ఎన్నికలకు సహకరించాలని కోరారు.

మినీ ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ ఏర్పాటు



కె.పొన్నురంగం



ఏ.హరీష్‌కుమార్

పుత్తూరు: పట్టణానికి చెందిన మినీ ట్రాన్స్‌పోర్ట్ ఓనర్స్, వర్కర్స్ యూనియన్‌ను ఏర్పాటు చేసినట్లు శుక్రవారం యూనియన్ ప్రధాన కార్యదర్శి కె. మురగారెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ సంఘ సభ్యుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన యూనియన్ ద్వారా వినియోగదారులకు మెరుగైన సేవలందించనున్నట్లు తెలిపారు. సంఘ అధ్యక్షుడిగా కె.పొన్నురంగం, ఉపాధ్యక్షుడిగా ఏ.హరీష్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా కె.మురగారెడ్డి, సహాయ కార్యదర్శిగా టి.రఘు, కోశాధికారిగా ఏ.ధనపాల్, కార్యనిర్వాహక సభ్యులుగా పి.తిరుమల, ఏ.నేతాజి, బి.సురేష్, ఎస్.జమీర్, సి.ఉమాపతి, ఎం.వెంకటయ్య, ఎం.కుమార్‌బాబు, పి.మూర్తివేలు, టి.కె.విక్రమ్, ఎస్.పళణిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చెప్పారు.

గజ వాహనంపై కరకంతేశ్వరుడు



భక్తులను కటాక్షిస్తున్న కామాక్షీ సమేత కరకంతేశ్వరుడు

నగరి : పట్టణ పరిధిలోని కామాక్షీ సమేత కరకంతేశ్వర ఆలయంలో నిర్వహిస్తున్న పంగుణోత్తర కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం కామాక్షీ సమేత కరకంతేశ్వర స్వామి గజ వాహనంపైనుంచి భక్తులను కటాక్షించారు. ఈ సందర్భంగా ఆలయంలో అభిషేక, అర్చనలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో ఊరేగింపుగా వచ్చిన స్వామివారికి భక్తులు కొబ్బరికాయలు కొట్టి, కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రజాస్వామ్యంలో ఓటు కీలకం



ర్యాలీ చేస్తున్న డ్వాక్రా మహిళలు

పాలసముద్రం : ప్రజాస్వామ్యంలో ఓటు కీలకం అని, ప్రతి భారతీయ పౌరుడు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐకేపీ ఏపీఎం ఫరీద్‌మస్తాన్ తెలిపారు. శుక్రవారం ఐకేపీ కార్యాలయంలో డ్వాక్రా మహిళలకు ఓటుహక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యం, ఎన్నికలు, ఓటు హక్కు గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. 18 ఏళ్లు నిండిన వెంటనే తప్పనిసరిగా ఓటర్ల జాబితాలో పేరు నమోదు చేయించుకోవాలని తెలిపారు. మంచి నాయకత్వం కోసం ఓటు వేయడం ముఖ్యమన్నారు. కార్యక్రమంలో సీసీ చిరంజీవి, సంఘమిత్ర మురగయ్య, శోభ, మంజుల, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మతల్లికి ప్రత్యేక పూజలు



విశేషాలంకరణలో ఎల్లమ్మతల్లి

పాలసముద్రం : మండలంలోని కృష్ణజిమ్మాపురంలో ఉన్న ఎల్లమ్మతల్లికి శుక్రవారం గ్రామస్తులు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. ఉదయం అమ్మవారికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, చందనంతో అభిషేకాలు చేశారు. అనంతరం అమ్మవారికి విశేషాలంకరణ చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ప్రతి ఇంటి నుంచి మహిళలు పూజ, పొంగళ్ల సామగ్రిని పంబవాయిద్యాల నడుమ గ్రామంలో ఊరేగింపుగా తీసుకుని అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. ఆలయ ఆవరణలో పొంగళ్లు పెట్టి, అమ్మవారికి నైవేద్యం సమర్పించి, ప్రత్యేక దీపారధనలు చేశారు. సాయంత్రం అర్చకులు అమ్మవారికి విశేషాలంకరణ చేసి, భక్తులకు దర్శనం కల్పించారు. మొక్కుబడి ఉన్న భక్తులు పిండి దీపాలు వెలిగించి, కొబ్బరి కాయలు కొట్టి, మొక్కులు తీర్చుకున్నారు.



పొంగళ్ల సామగ్రి ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

వ్యాధులపై అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న డాక్టర్ మోహన్‌కృష్ణ

పాలసముద్రం : వాతావరణంలో మార్పుల కారణంగా వచ్చే సీజన్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని వైద్యాధికారి మోహన్‌కృష్ణ తెలిపారు. శుక్రవారం వెంగళరాజు కుప్పం సచివాలయం ఆవరణలో ఎంఎల్‌హెచ్‌ఓ సునీత, ఏఎన్ఎం గంగాగౌరి అధ్యక్షతన 104 వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మోహన్‌కృష్ణ మాట్లాడుతూ గ్రామీణ ప్రజలు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం 104 వాహనం ద్వారా గ్రామాల్లోనే జ్వరం, దగ్గు, జలుబు, బీపీ, షుగర్ తదితర వ్యాధులకు పరీక్షలు చేసి, ఉచితంగా మందులు ఇస్తుందన్నారు. అనంతరం 27 మందికి వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపరవైజర్ సుశీల, ఆశా కార్యకర్తలు, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

రేపు పల్లె జానపద స్వరగానం

తిరుపతి కల్చరల్: కనుమరుగవుతున్న జానపద పాటలను పరిరక్షించి నేటి తరానికి అందించాలనే ఉద్దేశంతో శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఈనెల 24వ తేదీన ఎస్వీయూనివర్సిటీలోని ఆర్ట్స్ బ్లాక్‌లో పల్లె జానపద స్వరగానం కార్యక్రమం చేపడుతున్నట్లు ఆ సంస్థ రాష్ట్ర కార్యదర్శి జయపాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ జానపద స్వరగానం కార్యక్రమానికి రెండు తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 150 మంది జానపద కళాకారులు పాల్గొననున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా రచయిత ధనాశి ఉషారాణి స్వీయ రచన చేసిన పంచరవళి సంతకం పుస్తక ఆవిష్కరణ ఉంటుందని తెలిపారు.

12 నుంచి పట్టాభిరాముడి బ్రహ్మోత్సవాలు

తిరుపతి(అలిపిరి): వాల్మీకిపురం శ్రీ పట్టాభిరామ స్వామివారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ 12 నుంచి 20వ తేదీ వరకు వైభవంగా జరుగనున్నాయని జేఈఓ వీరబ్రహ్మం తెలిపారు. ఏప్రిల్ 11వ తేదీన సాయంత్రం 6 గంటలకు అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. బ్రహ్మోత్సవాల్లో రోజూ ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, రాత్రి 8 నుంచి 10 గంటల వరకు వాహనసేవలు నిర్వహిస్తారు.

12న ఉదయం ధ్వజారోహణం, రాత్రి గజవాహనంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 20న ఉదయం వసంతోత్సవం, చక్రస్నానం, రాత్రి హంస వాహనం, ధ్వజావరోహణం, బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏప్రిల్ 17న రాత్రి 8 నుంచి 10 గంటల వరకు శ్రీ సీతారామ కల్యాణోత్సవం జరుగనుంది. గృహస్తులు(ఇద్దరు) రూ.500 చెల్లించి కల్యాణోత్సవంలో పాల్గొనవచ్చని జేఈఓ తెలిపారు. గృహస్తులకు ఒక ఉత్తరీయం, రవికె, లడ్డూ ప్రసాదం బహుమానంగా అందజేస్తారన్నారు. అలాగే ఏప్రిల్ 21వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆలయంలో స్వామి, అమ్మవారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహిస్తారన్నారు. సాయంత్రం 5.30 నుంచి రాత్రి 7 గంటల వరకు పుష్పయాగం ఘనంగా జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో రోజూ ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

ఊంజల్‌సేవలో పద్మావతీ అమ్మవారు



నారాయణవనం: టీటీడీ అనుబంధ పద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో పంగుణోత్తర ఉత్సవాలలో భాగంగా శుక్రవారం సాయంత్రం అమ్మవారు ఊంజల్‌సేవలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉదయం సుప్రభాతసేవతో నిత్యపూజాకైంకర్యాలను, మూలవర్లకు శుక్రవార అభిషేకాలను పూర్తి చేసి నైవేద్యం సమర్పించారు. సాయంత్రం నిత్య పూజలు పూర్తి అయిన తర్వాత అమ్మవారిని పట్టు పీతాంబరాలు, స్వర్ణాభరణాలను, సుగంధ పుష్ప మాలికలతో సుందరంగా అలంకరించి తిరుచ్చి వాహనంపై అధిష్టింప చేశారు. ఆలయ అంతర ప్రాకారంలో ఊరేగిన అమ్మవారు ఊంజల్ మండలంలో ఊయలపై కొలువుదీరారు. దర్శించుకున్న భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్ ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రతి పుస్తకం డిజిటలైజ్ కావాలి



వీసీ శ్రీకాంత్‌రెడ్డిని సత్కరిస్తున్న గ్రంథాలయ సిబ్బంది, అధికారులు

తిరుపతి సిటీ : నేటి ఆధునిక యుగంలో ప్రతి పుస్తకాన్ని డిజిటలైజ్ చేసి పాఠకులకు అందుబాటులో ఉండేలా చూడడం గ్రంథాలయ ఉద్యోగుల కర్తవ్యమని ఎస్వీయూ వీసీ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. జాతీయ గ్రంథాలయ మిషన్ ఆధ్వర్యంలో వర్సిటీలో జరుగుతున్న ఉద్యోగుల 33వ శిక్షణా తరగతుల్లో పాల్గొన్న పౌరగ్రంథాలయ సిబ్బంది వీసీని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం చొరవతో మంత్రిత్వశాఖ ప్రోత్సాహంతో ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం వీసీని ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. సమావేశంలో తమిళనాడు, మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్ర పౌర గ్రంథాలయ సిబ్బంది, ఎస్వీయూ గ్రంథాలయ అధికారి సురేంద్రబాబు, ద్రావిడ వర్సిటీ గ్రంథాలయ అధికారి దొరస్వామి పాల్గొన్నారు.